RNI NO: APTEL/26/A3560

మహి న్యూస్

www.mahinewsindia.com

MAHI NEWS

Epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. సంపుటి : 01 సంచిక : 109 ఎడిటర్ : నీలి రాముసుబ్బయ్య. పేజీలు : 4 వెల రూ.2 ఆదివారం -30 - ఆగష్టు - 2026

Published From :Kurnool circulated by YSR Kadapa I Anatapuram I Chittoor I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana

ఏ క్షణంలోనైనా బద్దలవ్వొచ్చు.. నేపాల్‌కు చైనా మరోసారి హెచ్చరిక

- నేపాల్-టిబెట్ సరిహద్దులో కృత్రిమంగా ఏర్పడిన సరస్సుపై చైనా హెచ్చరిక
- హిమనీనదం కూలడంతో ఏర్పడిన సహజ ఆనకట్టతో మరో ప్రమాద ఘంటికలు
- సరస్సు నీటిమట్టం తగ్గడంతో తాత్కాలికంగా తగ్గిన తక్షణ ముప్పు
- ఇప్పటికే వందల మంది మృతి, వెయ్యికి పైగా గల్లంతు.. కొనసాగుతున్న సహాయక చర్యలు
- డ్రోన్లు, శాటిలైట్లతో పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్న అధికారులు

2లో

రూ.22,000 కోట్ల అప్పు.. అయినా తగ్గను, మళ్లీ పైకి లేస్తా: సుభాష్ చంద్ర



2లో

- రుణదాతలకు 99.97 శాతం కోత విధిస్తూ ఎన్‌సీఎల్‌టీ తీర్పు
- రూ.22,006 కోట్ల అప్పులకు కేవలం రూ.6.5 కోట్లు చెల్లింపు
- స్విట్జర్లాండ్‌లో కొత్త పని చేసి మళ్లీ సంపాదిస్తానన్న సుభాష్ చంద్ర

తెలుగు భాష, లిపిని భావితరాలకు సజీవంగా అందించాలి

- డిజిటల్ యుగంలో పిల్లలకు తెలుగు రాయడం నేర్పించాలని సూచన
- తెలుగు నేర్పించే 'కూల్‌ఫబెట్' యాప్ రూపకర్తలను ప్రత్యేకంగా అభినందించిన సీఎం
- ఏఐ టెక్నాలజీతో చేతిరాతను మెరుగుపరిచేలా యాప్ రూపకల్పనపై హర్షం

అమరావతి: 'దేశ భాషలందు తెలుగు లెస్స' అని శ్రీకృష్ణదేవరాయలు కీర్తించిన మన తెలుగు భాష గొప్పదనాన్ని భావితరాలకు సజీవంగా అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి మిగతా 2 లో

ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం.. రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని' అమలు

అల్లూరి జిల్లాలో ఆరోగ్య రథాలను ప్రారంభించిన సీఎం చంద్రబాబు

- ★ రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని' కార్యక్రమం అమలుకు నిర్ణయం
- ★ మారుమూల ప్రాంతాల్లో కనెక్టివిటీ కోసం సెల్ టవర్ల ఏర్పాటు
- ★ ప్రతి కుటుంబానికి నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యమన్న సీఎం

అమరావతి: రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఒక పటిష్టమైన వ్యవస్థను తీర్చిదిద్దుతున్నామని ఏపీ సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఇందులో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 'సంజీవని' కార్యక్రమాన్ని ప్రారంభించారు. నేడు అరకులోయ మండలం గన్నెలలో ఆయన పర్యటించి, పలు 'ఆరోగ్య రథాల'ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా మారుమూల ప్రాంతాల్లోని ప్రజల ముంగిటకే నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి మిగతా 2 లో

2లో

గత ప్రభుత్వానికి నరకడం తప్ప నాటే ఆలోచనే రాలేదు: ఏపీ గ్రీన్ కమిటీ చైర్మన్ నాగబాబు

- తమది నాటే సంస్కృతే కానీ, నరికేది కాదని స్పష్టం
- మంగళగిరి అరణ్యారామంలో రావి-వేప మొక్కలు నాటిన నాగబాబు దంపతులు
- హరితాంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యమని పిలుపు
- రూ.24 కోట్లతో నిర్మించనున్న అరణ్యారామం భవన డిజైన్ల పరిశీలన

అమరావతి: ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన జనసేన

తెలంగాణలో అంగన్‌వాడీ ఉద్యోగాల జాతర.. ఇంటర్ అర్హతతో 15,982 పోస్టుల భర్తీ

సెప్టెంబర్ నాటికి నియామకాలు పూర్తి చేయాలని ప్రభుత్వ ఆదేశం

- ఇంటర్ పాసైన వారు అర్హులు, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థుల ఎంపిక
- ఎంపికలో ఇంటర్ మార్కులకు 70 శాతం వెయిటేజీ
- రెండు జోన్ల పరిధిలో టీచర్లు, ఆయాల పోస్టుల భర్తీ

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని నిరుద్యోగులకు శుభవార్త చెప్పింది. రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న భారీ సంఖ్యలో పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు మొత్తం 15,982 పోస్టులను సెప్టెంబర్ నెలలోగా భర్తీ చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. మిగతా 2 లో

2లో

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం.. తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన

- మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ
- సెప్టెంబర్ 2 వరకు వర్షాల తీవ్రత కొనసాగే అవకాశం ఉందని వెల్లడి
- లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

పదోసారి సవాల్ చేస్తున్నా.. డేట్-టైమ్-ప్లేస్ ఫిక్స్ చెయ్ జగన్..

ఏపీపీఎస్సీ, డీఎస్సీకి తేడా తెలియని అజ్ఞాని జగన్

చర్చకు నేను రెడీ

- సార్వత్రిక ఎన్నికల కన్నా 2 శాతం ఎక్కువ ఓట్లతో స్థానిక ఎన్నికల్లో గెలుస్తామన్న ధీమా
- జగన్ తప్పుడు పనుల వల్లే వైసీపీ నేతలు జైళ్లకు వెళుతున్నారని ఆరోపణ
- మరో మూడుసార్లు గెలిస్తేనే రాష్ట్రం గాడిన పడుతుందని వ్యాఖ్య

అమరావతి: "జగన్.. నీకు పదోసారి సవాల్ విసురుతున్నా. డేట్, టైమ్, ప్లేస్ ఫిక్స్ చెయ్. పులివెందులకు రమ్మన్నా వస్తా, తాడేపల్లిలోని నీ కొంపకు రమ్మన్నా వస్తా. చర్చకు నేను సిద్ధం, నువ్వు సిద్ధమా? మిగతా 2 లో

వరద నీటిపై స్పష్టత ఉండాలి బలమైన వాదనలు వినిపించండి

ఉమ్మడి ఏపీకిచ్చిన 811 టీఎంసీలపైనే ప్రధాన దృష్టి

- ★ కృష్ణా ట్రైబ్యునల్ ఎదుట మన అవసరాలు చెప్పండి
- ★ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం
- ★ అంతర్రాష్ట్ర జల వివాదాలు, సుప్రీంకోర్టులో కేసులపై చర్చ

హైదరాబాద్: వరద నీటిపై కూడా స్పష్టత ఉండాలని, కృష్ణాపై ఉన్న మూడు ప్రాజెక్టులు నిండి పైనుంచి ప్రవహించినపుడే వరద నీరని, అయితే వరద నీటిమీద ఆధారపడి చేపట్టిన ప్రాజెక్టులకు వరద రాకుండానే నీటిని తీసుకోవడాన్ని ప్రస్తావించినట్లు తెలిసింది. మల్యాల, ముచ్చుమర్రి నుంచి ఆంధ్రప్రదేశ్ నీటిని తీసుకోవడంవల్ల విద్యుదుత్పత్తిపై ప్రభావం పడుతుందని, వరద లేకుండానే ఆంధ్రప్రదేశ్ మళ్లించినపుడు మిగతా 2 లో

సర్ పై ఎన్నికల సంఘానికి రేవంత్ రెడ్డి లేఖ

తుది ఓటర్ల జాబితా గడువునూ పెంచాలి

- ఎస్ఐఆర్‌పై అభ్యంతరాలు, క్లెయిమ్‌ల గడువులు పొడిగించాలి
- ఓటర్లు నోటీసులకు స్పందించేందుకు ఓటర్లకు సమయం ఇవ్వాలి
- ఓటర్ల జాబితాలో అర్హుల ఓట్లు తొలగిపోకుండా చూడాల్సిన అవసరం ఉంది

హైదరాబాద్: సర్ ప్రక్రియపై కేంద్రఎన్నికల సంఘానికి సీఎం రేవంత్ రెడ్డి (శనివారం) లేఖ రాశారు. ఎస్ఐఆర్‌పై అభ్యంతరాలు, మిగతా 2 లో

2లో

తెలంగాణలో సెప్టెంబర్ 8, 9 తేదీల్లో టీచర్లకు ప్రత్యేక టెట్

- ఇన్-సర్వీస్ టీచరకు టెట్ షెడ్యూల్ విడుదల
- సెప్టెంబర్ 8, 9 తేదీల్లో ఆన్‌లైన్ పరీక్షలు
- మొత్తం 24,983 మంది అభ్యర్థులు హాజరు

ఏ క్షణంలోనైనా బద్దలవ్వొచ్చు.. నేపాల్‌కు చైనా మరోసారి హెచ్చరిక

ఢిల్లీ: నేపాల్-టిబెట్ సరిహద్దులో హిమనీనదం కూలిపోవడంతో ఏర్పడిన కృత్రిమ సరస్సు (బ్యారియర్ లేక్) ఏ క్షణంలోనైనా బద్దలయ్యే ప్రమాదం ఉందని చైనా అధికారులు నేపాల్‌ను మరోసారి హెచ్చరించారు. ఈ సరస్సు గట్టు తెగితే భారీగా వరద నీరు దిగువ ప్రాంతాలకు ప్రవహించే అవకాశం ఉందని అప్రమత్తం చేశారు. అయితే, తాజా అంచనాల ప్రకారం తక్షణ ముప్పు కాస్త తగ్గిందని, పరిస్థితి కొంత అదుపులోకి వచ్చిందని కూడా వారు వెల్లడించారు. బుధవారం అత్యంత ఎత్తులో ఉన్న ఒక హిమనీనదం విస్ఫోటనం చెందడంతో ఈ ప్రళయం సంభవించింది. ఈ దుర్ఘటనలో భారీగా రాళ్లు, మంచు, బురద కొట్టుకువచ్చి నదీ ప్రవాహానికి అడ్డుకట్ట వేయడంతో ఈ సహజ ఆనకట్ట ఏర్పడింది. దీనివల్ల గైరాంగ్ సరిహద్దు క్రాసింగ్, భోటే కోశి, త్రిశూలి నదీ వ్యవస్థల పరిధిలోని ప్రాంతాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో నేపాల్ విదేశాంగ శాఖకు చైనా అధికారులు ఒక సందేశం పంపారు. సరస్సులోని నీటి రంగు క్రమంగా ముదురు రంగులోకి మారుతోందని, ఇది ఆనకట్ట ఏ క్షణంలోనైనా బద్దలవడానికి సంకేతం కావచ్చని పేర్కొన్నారు. శుక్రవారం నాటికి సరస్సులో సుమారు 2.5 మిలియన్ క్యూబిక్ మీటర్ల నీరు చేరిందని అంచనా వేశారు. ఒకవేళ ఆనకట్ట పాక్షికంగా బద్దలైతే, సెకనుకు 500 క్యూబిక్ మీటర్ల వేగంతో ప్రవాహం ఉండవచ్చని, ఇది నది గట్లకే పరిమితం అవుతుందని తెలిపారు. అయితే, ఆ తర్వాత చైనా అధికారులు మరో తాజా సమాచారం అందించారు. సరస్సు ఉపరితల వైశాల్యం తగ్గిందని, దీంతో వరద ముప్పు కాస్త తగ్గిందని వారు స్పష్టం చేశారు. ఈ అంచనాతో తాత్కాలికంగా నిలిపివేసిన సహాయక చర్యలను పునఃప్రారంభించారు. అధికారులు డ్రోన్లు, శాటిలైట్ల సహాయంతో పరిస్థితిని నిరంతరం గమనిస్తున్నారు. దీనికి ఎగువన మరో పెద్ద నీటి వనరును కూడా గుర్తించి, దాని కదలికలను కూడా పర్యవేక్షిస్తున్నారు. ఈ విపత్తు కారణంగా సరిహద్దుకు ఇరువైపులా వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. వెయ్యి మందికి పైగా గల్లంతయ్యారు. మృతుల్లో చాలా మంది విదేశీయులు కూడా ఉన్నారు. ప్రతికూల వాతావరణం, మళ్లీ వరదలు రావచ్చన్న ఆందోళనల మధ్య సహాయక చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి.

రూ.22,000 కోట్ల అప్పు.. అయినా తగ్గను, మళ్లీ పైకి లేస్తా

ఢిల్లీ: ఒకప్పుడు దేశ మీడియా రంగాన్ని శాసించిన ఎస్సెల్ గ్రూప్ ఛైర్మన్ సుభాష్ చంద్ర, తాను తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ వెనకడుగు వేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. దాదాపు రూ.22,006 కోట్ల రుణాలకు గాను కేవలం రూ.6.5 కోట్లు చెల్లించేలా నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఆమోదించిన రుణ పరిష్కార ప్రణాళిక నేపథ్యంలో ఆయన ఒక వీడియో ప్రకటన విడుదల చేశారు. రుణదాతలకు దాదాపు 99.97 శాతం నష్టం వాటిల్లుతున్న ఈ తరుణంలో, తన భవిష్యత్ ప్రణాళికలను ఆయన ధైర్యంగా ప్రకటించారు. "నేను సర్వస్వం కోల్పోయిన వ్యక్తిగా మాట్లాడటం లేదు. నా దగ్గర మిగిలిన చివరి రూ.6.5 కోట్లు కూడా ఆమోదించిన ప్లాన్ ప్రకారమే చెల్లించాల్సి ఉంటుంది. నాకు ఒక చిన్న ఇల్లు ఉంది, దానిని అద్దెకిచ్చి వచ్చే ఆదాయంతోనే నా ఖర్చులు వెళ్లదీస్తున్నాను. నాకేమీ పశ్చాత్తాపం లేదు. నేను మళ్లీ సంపాదిస్తాను. నేను ఒక మార్గదర్శకుడిని. కొత్త విషయాలను ఎలా ప్రారంభించాలో నాకు తెలుసు, ఆ పని కొనసాగిస్తాను" అని 75 ఏళ్ల సుభాష్ చంద్ర తన వీడియో సందేశంలో వివరించారు. ఎస్సెల్ గ్రూప్ ఛైర్మన్‌గా మీడియా నుంచి మౌలిక సదుపాయాలు, అమ్యూజ్‌మెంట్ పార్కుల వరకు ఆయన వ్యాపార సామ్రాజ్యం విస్తరించింది. ఇప్పుడు తన తదుపరి ప్రణాళికల గురించి మాట్లాడుతూ, స్విట్జర్లాండ్‌లో కొత్త పని చేయనున్నట్లు తెలిపారు. "ప్రస్తుతం, స్విట్జర్లాండ్‌లో ఇన్వెస్ట్‌మెంట్ రంగంలో పనిచేసే నా స్నేహితులతో కలిసి పనిచేయాలని ఆలోచిస్తున్నాను. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను ఒకటి రెండు వారాల్లో వెల్లడిస్తాను. అలాగే, కొన్ని స్టార్టప్‌లను ముందుకు నడిపించేందుకు నా కుటుంబం నుంచి రూ.2-4 కోట్ల వరకు అప్పు తీసుకునే అవకాశం కూడా ఉంది" అని ఆయన పేర్కొన్నారు. ఎన్‌సీఎల్‌టీ ఆమోదించిన ప్రణాళిక ప్రకారం, రుణదాతలు క్లెయిమ్ చేసిన రూ.22,006.57 కోట్లకు బదులుగా కేవలం రూ.6.5 కోట్లు మాత్రమే పంపిణీకి అందుబాటులో ఉంటాయి. ఇది రుణదాతలకు భారీ నష్టాన్ని మిగిల్చినప్పటికీ, సుభాష్ చంద్ర మాత్రం ఆత్మవిశ్వాసంతో కొత్త ప్రయాణానికి సిద్ధమవుతున్నట్లు ప్రకటించడం గమనార్హం.

గత ప్రభుత్వానికి నరకడం తప్ప నాటే ఆలోచనే రాలేదు: ఏపీ గ్రీన్ కమిటీ ఛైర్మన్ నాగబాబు

అమరావతి: ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన జనసేన ఎమ్మెల్సీ నాగబాబు, గత ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వానికి చెట్లు నరకడం తప్ప, నాటాలనే ఆలోచన రాలేదని, తమది నరికే సంస్కృతి కాదని, నాటే సంస్కృతి అని స్పష్టం చేశారు. హరితాంధ్రప్రదేశ్ సాధనలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం మంగళగిరిలోని అరణ్యారామం నందవనంలో నిర్వహించిన 'అశ్వత్థ నారాయణ వివాహం' కార్యక్రమంలో నాగబాబు తన అర్ధాంగి పద్మజతో కలిసి పాల్గొన్నారు. శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించిన అనంతరం ఆయన దంపతులు రావి-వేప మొక్కలను నాటారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ, భూమాతను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని గుర్తుచేశారు. అడవుల నరికివేత, విచక్షణారహిత మైనింగ్ వంటి చర్యలతో మనమే భూమాతను గాయపరుస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పాటు తనకు ఒకేరకమైన ఆలోచనలు ఉన్నాయని నాగబాబు తెలిపారు. రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలనే ఉమ్మడి సంకల్పమే తమను ఒకే వేదికపైకి తెచ్చిందని అన్నారు. భారతీయ సంప్రదాయంలో రావి, వేప చెట్లకు విశిష్ట స్థానం ఉందని, వాటిని కలిపి నాటడం వల్ల జీవవైవిధ్య పరిరక్షణకు ఎంతో మేలు జరుగుతుందని వివరించారు. అనంతరం, రూ.24 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 'అరణ్యారామం' భవన డిజైన్లను నాగబాబు పరిశీలించారు. ఈ భవన నిర్మాణాన్ని 10 నెలల్లో పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశామని పీసీసీఎఫ్ చీఫ్ పి.వి. చలపతిరావు ఆయనకు వివరించారు. ఈ నిర్మాణం కోసం తొలగించాల్సి వచ్చిన 73 చెట్లను నరికివేయకుండా, వేరేచోట విజయవంతంగా పునఃప్రతిష్ఠాపన చేయడంపై ఆయన అధికారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పీసీసీఎఫ్ పి.వి. చలపతిరావు, సీసీఎఫ్ వైల్డ్ లైఫ్ నాగేశ్వరరావు, డీఎఫ్ఓ హిమశైలజ తదితర అటవీ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం.. తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన

ఢిల్లీ: బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని, దీని ప్రభావంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో రాబోయే కొద్దిరోజుల్లో వర్షాలు మళ్లీ పుంజుకునే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. బంగాళాఖాతంలో వేగంగా మారుతున్న ఈ వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రజలు, ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల వాసులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తరాంధ్ర జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడే అవకాశం ఉందని తెలిపారు. ఈ వర్షాల తీవ్రత సెప్టెంబర్ 2 వరకు కొనసాగే అవకాశం ఉందని, ఉత్తరాంధ్రతో పాటు రాయలసీమలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేశారు. ఇక తెలంగాణలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని, రాజధాని హైదరాబాద్‌లో రానున్న 24 గంటల్లో ఆకాశం దట్టంగా మేఘావృతమై అప్పుడప్పుడు వాన చినుకులు పడే అవకాశం ఉందన్నారు. వర్షాలు, ఈదురుగాలుల సమయంలో ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. పిడుగులు పడే ప్రమాదం ఉన్నందున బహిరంగ ప్రదేశాల్లో ఉండకూడదని... చెట్లు, భారీ విద్యుత్ స్తంభాలు, పాత భవనాల కింద నిలబడ వద్దని హెచ్చరించారు. వర్షం కురుస్తున్న సమయాల్లో వాహనదారులు ప్రయాణాల్లో వేగాన్ని తగ్గించి జాగరూకతతో వాహనాలు నడపాలని విపత్తు నిర్వహణ శాఖ కోరింది.

తెలంగాణలో సెప్టెంబర్ 8, 9 తేదీల్లో టీచర్లకు ప్రత్యేక టెట్

హైదరాబాద్: తెలంగాణలో ఇన్-సర్వీస్ ఉపాధ్యాయుల కోసం నిర్వహించే ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) షెడ్యూల్‌ను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. 2026 విద్యా సంవత్సరానికి గాను సెప్టెంబర్ 8, 9 తేదీల్లో ఈ పరీక్షలను ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఈ ప్రత్యేక టెట్ కోసం రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 24,983 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. పరీక్షలను ప్రతిరోజూ మూడు షిఫ్టుల్లో నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఉదయం 9:00 గంటల నుంచి 11:30 వరకు, మధ్యాహ్నం 2:00 గంటల నుంచి 4:30 వరకు వివిధ సెషన్లలో పరీక్షలు జరుగుతాయి. సెప్టెంబర్ 8న పేపర్-1, పేపర్-2 (తెలుగు, ఇంగ్లీష్ మీడియం) పరీక్షలు నిర్వహిస్తారు. సెప్టెంబర్ 9వ తేదీన మిగిలిన మాధ్యమాలకు సంబంధించిన పేపర్-2 పరీక్షలు నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రభుత్వ, సంబంధిత పాఠశాలల్లో పనిచేస్తూ, ఇప్పటికీ నిర్దేశిత అర్హత ప్రమాణాలను సాధించని ఉపాధ్యాయుల కోసమే ఈ ప్రత్యేక టెట్‌ను నిర్వహిస్తున్నారు. హాల్ టికెట్లు, ఇతర పూర్తి వివరాల కోసం అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ schooledu.telangana.gov.in సందర్శించాలని విద్యాశాఖ సూచించింది.

సర్ పై ఎన్నికల సంఘానికి రేవంత్ రెడ్డి లేఖ

గస్టు 3న సర్వే పూర్తి కాగానే ఓటరు డ్రాఫ్ట్ జాబితా ఆగస్టు 10న ప్రచురించనున్నట్లు అని తెలిపింది

హైదరాబాద్: సర్ ప్రక్రియపై కేంద్రఎన్నికల సంఘానికి సీఎం రేవంత్ రెడ్డి (శనివారం) లేఖ రాశారు. ఎస్ఐఆర్‌పై అభ్యంతరాలు, క్లెయిమ్‌ల గడువులు పొడిగించాలని కోరారు. మరో నాలుగు వారాల పాటు ఈ గడువును పెంచాలని కేంద్ర ఎన్నికల సంఘానికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. వాటితో పాటు తుది ఓటర్ల జాబితా గడువునూ పెంచాలని కోరారు. 73.39 లక్షల ఓటర్ల ఎంట్రీలు సర్ జాబితాలోకి వెళ్లాయని దీంతో తాత్కాలికంగా వెళ్లిన వారిని సైతం శాశ్వతంగా తరలివెళ్లినట్లు పరిగణించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఓటర్లు నోటీసులకు స్పందించేందుకు ఓటర్లకు సమయం ఇవ్వాలని సూచించారు. ఓటర్ల జాబితాలో అర్హుల ఓట్లు తొలిగిపోకుండా చూడాల్సిన అవకాశం ఉందని ఈ నేపథ్యంలో ఎస్ఐఆర్‌పై అభ్యంతరాలు, క్లెయిమ్‌ల గడువు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. కాగా రాష్ట్రంలో ఎస్ఐఆర్ గడువును ఇదివరకే కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది. ఎస్ఐఆర్ ప్రక్రియను ఆగస్టు మూడు వరకూ పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. ఆగస్టు 3న సర్వే పూర్తి కాగానే ఓటరు డ్రాఫ్ట్ జాబితా ఆగస్టు 10న ప్రచురించనున్నట్లు అని తెలిపింది. అభ్యంతరాల స్వీకరణ ఆగస్టు 10 నుంచి సెప్టెంబర్ 9 వరకూ గడువుగా పేర్కొంది. చివరగా అక్టోబర్ 12న తుది ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం ప్రకటించించనుంది. ఈ నేపథ్యంలో మరోసారి గడువు పెంచాలని సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశారు.

వరద నీటిపై స్పష్టత ఉండాలి.. బలమైన వాదనలు వినిపించండి

వరద లేకుండానే ఆంధ్రప్రదేశ్ మళ్లించినపుడు కోల్పోయే విద్యుత్తుకు పరిహారం కోరే అంశాన్ని, దీనిని ట్రిబ్యునల్ దృష్టికి తీసుకెళ్లడం గురించి ఆలోచించాలని న్యాయవాద బృందానికి, ఇంజినీర్లకు సీఎం సూచించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. 2014 కంటే ముందు మంజూరైన ప్రాజెక్టుల వివరాలన్నీ తయారు చేయాలని ఇంజినీర్లను సీఎం ఆదేశించారు. తెలంగాణకు జరిగిన అన్యాయం, బేసిన్ పరిధిని పరిగణనలోకి తీసుకొని నీటిని పంపిణీ చేయమని గట్టిగా కోరడం, కృష్ణా ట్రిబ్యునల్-1, కృష్ణా ట్రిబ్యునల్-2 కలిపి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న 1050 టీఎంసీలు, పోలవరం ద్వారా తరలించే 45 టీఎంసీల్లో 71 శాతం వాటా కోరాలని, ఆంధ్రప్రదేశ్ బేసిన్ బయటి ప్రాజెక్టులకే 325 టీఎంసీలు మళ్లిస్తుందని, బేసిన్‌లోని ప్రాజెక్టులకే ఎక్కువ నీటిని కేటాయించాలని, పంట నీటి అవసరాలను శాస్త్రీయంగా అంచనా వేసి ట్రిబ్యునల్ దృష్టికి తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి సూచించారు. టీఓఆర్‌ను సవాలు చేస్తూ ఆంధ్రప్రదేశ్ దాఖలు చేసిన కేసు, కేఆర్ఎంబీకి ప్రాజెక్టులను అప్పగించాలని ఏపీ దాఖలు చేసిన కేసు, కృష్ణా ట్రిబ్యునల్-2ను నోటిఫై చేయాలని వేసిన కేసులు, కర్ణాటకలోని అప్పర్ భద్ర, అప్పర్‌తుంగ ప్రాజెక్టులకు అనుమతులివ్వడాన్ని సవాలు చేస్తూ దాఖలు చేసిన కేసు, పోలవరం-నల్లమలసాగర్/బనకచెర్ల నీటిమళ్లింపును వ్యతిరేకిస్తూ దాఖలు చేసిన కేసుల గురించి ముఖ్యమంత్రి, మంత్రి న్యాయవాదులు, అధికారులతో వివరంగా చర్చించారు.

కృష్ణా ట్రిబ్యునల్ ఎదుట మన అవసరాలు చెప్పండి

కృష్ణా ట్రిబ్యునల్ ఎదుట తెలంగాణ నీటి అవసరాలకు తగ్గట్లుగా బలమైన వాదనలు వినిపించాలని, ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపులపై ఎక్కువ దృష్టి సారించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. రాష్ట్రంలోని కరవు, ఫ్లోరైడ్, వెనకబడిన ప్రాంతాల్లో ప్రజల సాగు, తాగునీటి అవసరాలను ఆధారాలతో చూపి వాదించాలని కోరారు. బచావత్ ట్రిబ్యునల్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన 811 టీఎంసీలపైనే ప్రధానంగా దృష్టి కేంద్రీకరించాలని, తర్వాత కృష్ణా ట్రిబ్యునల్-2 కేటాయించిన నీటిపై కసరత్తు ముమ్మరం చేయాలని నీటిపారుదల శాఖ అధికారులకు స్పష్టం చేశారు. అంతర్రాష్ట్ర జల వివాదాలు, కృష్ణా ట్రిబ్యునల్ ఎదుట వాదనలు, సుప్రీంకోర్టులో కేసులు తదితర అంశాలపై ముఖ్యమంత్రి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో చర్చించిన ముఖ్యాంశాలిలా ఉన్నాయి. మొదట ట్రిబ్యునల్ ఎదుట వాదనలు, సుప్రీంకోర్టులో కేసులు, ప్రస్తుత పరిస్థితి గురించి సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ వివరించారు. పునర్విభజన చట్టం ప్రకారం ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపులు, తక్కువ నీటి లభ్యత ఉన్నప్పుడు వినియోగం, తర్వాత మొత్తం కేటాయింపుపై విచారణకు కేంద్రం జారీ చేసిన టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ (టీఓఆర్), దీనిపై ఆంధ్రప్రదేశ్ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన కేసు, బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ 65 శాతం నీటి లభ్యత ఆధారంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చేసిన కేటాయింపులు, దీనిపై సుప్రీంకోర్టులో కేసు కారణంగా తీర్పు నోటిఫై కాకపోవడం గురించి చెప్పారు.

సెప్టెంబరు 16-18 వరకు తెలంగాణ వాదనలు

2023 అక్టోబరు 6న కేంద్రం జారీ చేసిన తదుపరి టీఓఆర్ ప్రకారం తుది వాదనలు జరుగుతున్నాయని, ఆంధ్రప్రదేశ్ వాదనలు ఆగస్టు 13న ముగియగా, తెలంగాణ తరఫున రిజాయిండర్ వాదనలు 14న జరిగాయని, సెప్టెంబరు 16-18 వరకు జరిగే ట్రిబ్యునల్ సమావేశాల్లో తెలంగాణ తదుపరి వాదనలు వినిపించాల్సి ఉందని న్యాయవాదులు వివరించారు. బచావత్ ట్రిబ్యునల్ 811 టీఎంసీలు కేటాయించగా.. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ 65 శాతం, సరాసరి నీటి లభ్యతతో చేసిన కేటాయింపులతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 1050 టీఎంసీలున్నాయి. అయితే బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తీర్పును ఇంకా నోటిఫై చేయనందున మొదట బచావత్ కేటాయించిన 811 టీఎంసీల్లో ఎక్కువ వాటా, ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపులపై దృష్టి కేంద్రీకరించాలని న్యాయవాదుల బృందానికి, అంతర్రాష్ట్ర జల వనరుల విభాగం ఇంజినీర్లకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ కేటాయింపులను మనం వ్యతిరేకించి సుప్రీంకోర్టుకు వెళ్తే, అమలు చేయాలని కర్ణాటక కోరుతుందని, ప్రస్తుత లక్ష్యం 811 టీఎంసీలేనని స్పష్టం చేశారు. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తీర్పు అమలైతే కృష్ణా నదీ యాజమాన్యబోర్డు మనుగడ కూడా ఉండదని, ట్రిబ్యునల్ సిఫార్సు చేసిన పర్యవేక్షణ బోర్డు ఉంటుందని, దీనిని కూడా పరిగణనలోకి తీసుకోవాలన్నారు.

పదోసారి సవాల్ చేస్తున్నా.. డేట్-టైమ్-ప్లేస్ ఫిక్స్ చెయ్ జగన్..

అమరావతి: "జగన్.. నీకు పదోసారి సవాల్ విసురుతున్నా. డేట్, టైమ్, ప్లేస్ ఫిక్స్ చెయ్. పులివెందులకు రమ్మన్నా వస్తా, తాడేపల్లిలోని నీ కొంపకు రమ్మన్నా వస్తా. చర్చకు నేను సిద్ధం, నువ్వు సిద్ధమా? ఏపీపీఎస్సీకి, డీఎస్సీకి తేడా తెలియని నువ్వు నాకు నీతులు చెబుతావా?" అంటూ విద్యాశాఖ మంత్రి, తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. జగన్ లాంటి చేతకాని నాయకుడిని తాను ఎన్నడూ చూడలేదని, ఆయనకు నిజం చెబితే తల వెయ్యి ముక్కలయ్యే శాపం ఉందని ఎద్దేవా చేశారు.

డీఎస్సీ, వెలిగొండపై ఘాటు విమర్శలు

గత ప్రభుత్వంలో డీఎస్సీపై 150 కేసులు వేయించినా, తాము విజయవంతంగా పూర్తిచేసి ఉద్యోగాలు ఇచ్చామని లోకేశ్ గుర్తుచేశారు. "అది మా చిత్తశుద్ధి. మీరు నిర్వహించిన గ్రూప్-1 అవకతవకలపై కోర్టు పర్యవేక్షణలో విచారణ జరుగుతోంది. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని న్యాయస్థానమే చెప్పింది. ఈ ఏడాది మాత్రమే కాదు, రాబోయే మూడేళ్లు కూడా డీఎస్సీ నిర్వహిస్తాం. జగన్ వాళ్ల తాత వచ్చినా మమ్మల్ని అడ్డుకోలేరు" అని స్పష్టం చేశారు. వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసింది చంద్రబాబేనని, త్వరలో పూర్తి చేసి ప్రారంభించేది కూడా చంద్రబాబేనని అన్నారు. పనులు పూర్తి చేయకుండానే జాతికి అంకితం చేశారని, ఇప్పుడు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇచ్చి పనులు పూర్తి చేస్తుంటే క్రెడిట్ చోరీ అంటున్నారని మండిపడ్డారు.

స్థానిక ఎన్నికల్లోనూ గెలుపే లక్ష్యం

త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని లోకేశ్ పిలుపునిచ్చారు. "అందరం కలిసికట్టుగా పనిచేస్తే సార్వత్రిక ఎన్నికల కంటే 2 శాతం అదనపు ఓట్లతో ఘన విజయం సాధిస్తాం. కార్యకర్తలు నా చుట్టూ కాదు, ప్రజల చుట్టూ తిరగండి. పదవులు ఇచ్చే బాధ్యత నాది" అని భరోసా ఇచ్చారు.

మై టీడీపీ యాప్ ద్వారా 4 లక్షల మంది నాయకులను పర్యవేక్షిస్తున్నామని, పార్టీ కార్యక్రమాలను సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. ఒంగోలు పోతురాజు కాల్వ, నల్లకాలువల అభివృద్ధికి వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయించే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. అహంకారంతో వ్యవహరిస్తే ప్రజలకు దూరం అవుతామని హితవు పలికారు.

మరో మూడుసార్లు గెలవాలి

రాష్ట్రాన్ని పూర్తిగా గాడిలో పెట్టాలంటే కనీసం మరో మూడుసార్లు వరుసగా టీడీపీ కూటమి గెలవాల్సిన అవసరం ఉందని లోకేశ్ అభిప్రాయపడ్డారు. "గత ఎన్నికల్లో జనసేన, బీజేపీలతో కలిసి 94 శాతం సీట్లు గెలిచాం. మన ఐక్యత ఇలాగే కొనసాగాలి. సోషల్ మీడియాలో ఒకరిపై ఒకరు పోస్టులు పెట్టుకుంటే రాష్ట్రమే నష్టపోతుంది" అని అన్నారు. తనపై గత ప్రభుత్వం 23 తప్పుడు కేసులు పెట్టిందని, వాటిలో అటెంప్ట్ మర్డర్, ఎస్సీ, ఎస్టీ కేసులు కూడా ఉన్నాయని గుర్తుచేశారు. తాను జగన్‌లా కంచుకోటలో పోటీ చేయలేదని, 40 ఏళ్లలో గెలవని మంగళగిరిలో 91 వేల మెజారిటీతో గెలవడం తన సత్తా అని అన్నారు.

జగన్ తప్పులకు వైసీపీ నేతల బలి

జగన్ చేసిన తప్పుడు పనుల వల్లే కొందరు వైసీపీ నాయకులు ఈరోజు జైళ్లకు వెళుతున్నారని, ఇప్పుడు వారంతా కులం కార్డు వాడుతున్నారని లోకేశ్ ఆరోపించారు. బీసీలకు 10 శాతం రిజర్వేషన్లు తగ్గించి 17 వేల మందికి పదవులు రాకుండా అడ్డుకున్నారని విమర్శించారు. అమర్‌నాథ్ గౌడ్, నందం సుబ్బయ్య, తోట చంద్రయ్య హత్యలను ప్రస్తావిస్తూ వైసీపీ పాలనలో అరాచకాలు పెరిగాయన్నారు. మాజీ మంత్రులు సీదిరి అప్పలరాజు, కారుమూరి నాగేశ్వరరావుల ఉదంతాలను ఉటంకిస్తూ.. వారు చేసిన తప్పుల వల్లే చట్టపరమైన చిక్కుల్లో పడ్డారని, దీనికి ప్రభుత్వానికి సంబంధం లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, పలువురు టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రాష్ట్రం ప్రస్తుతం కఠిన పరిస్థితుల్లో ఉందని, రూపాయి ఆదాయంలో 94 పైసలు జీతాలకే పోతోందని, అయినా చంద్రబాబు రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా నిలపడానికి అహర్నిశలు శ్రమిస్తున్నారని లోకేశ్ తెలిపారు.

ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం.. రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని' అమలు: సీఎం చంద్రబాబు

అమరావతి: రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఒక పటిష్ఠమైన వ్యవస్థను తీర్చిదిద్దుతున్నామని ఏపీ సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఇందులో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 'సంజీవని' కార్యక్రమాన్ని ప్రారంభించారు. నేడు అరకులోయ మండలం గన్నెలలో ఆయన పర్యటించి, పలు 'ఆరోగ్య రథాల'ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా మారుమూల ప్రాంతాల్లోని ప్రజల ముంగిటకే నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. కొండ ప్రాంతాల్లోని ప్రజలు వైద్యం కోసం కిలోమీటర్ల కొద్దీ ప్రయాణించాల్సిన దుస్థితి ఉండకూడదన్నదే తన సంకల్పమని ఉద్ఘాటించారు. ఈ సమస్యను అధిగమించేందుకే 'సంజీవని' కార్యక్రమాన్ని రూపొందించామని, దీనిని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లోని ప్రతి కుటుంబానికీ నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ ధ్యేయమని వివరించారు. ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు యోగా, ధ్యానం వంటి కార్యక్రమాలను కూడా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్య సేవలతో పాటు కనెక్టివిటీకి కూడా తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని చంద్రబాబు పేర్కొన్నారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో సిగ్నల్ సమస్యను పరిష్కరించేందుకు సెల్ టవర్లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. తంలోనే అల్లూరి సీతారామరాజు ఈ ప్రాంత గిరిజనులకు ఆయుర్వేద వైద్యం అందించారని గుర్తుచేశారు. ఆ మహనీయుడిని నిత్యం స్మరించుకునేందుకే భోగాపురంలో కొత్తగా నిర్మించిన అంతర్జాతీయ విమానాశ్రయానికి 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం' అని నామకరణం చేసినట్లు వెల్లడించారు. గిరిజన బిడ్డలు థింసా నృత్యంతో గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించడంపై ఆయన హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

తెలుగు భాష, లిపిని భావితరాలకు సజీవంగా అందించాలి

అమరావతి: 'దేశ భాషలందు తెలుగు లెస్స' అని శ్రీకృష్ణదేవరాయలు కీర్తించిన మన తెలుగు భాష గొప్పదనాన్ని భావితరాలకు సజీవంగా అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. మాటల్లోనే కాదు, అక్షరాల్లోనూ తెలుగు భాష వైభవం తరతరాలకు నిలవాలని ఆయన ఆకాంక్షించారు. నేటి డిజిటల్ యుగంలో పిల్లలకు తెలుగు చదవడం, రాయడంపై ఆసక్తి పెంచాల్సిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ముఖ్యమంత్రి తన అభిప్రాయాలను పంచుకున్నారు. చిన్నతనం నుంచే పిల్లల్లో అక్షరంపై మమకారం, భాషపై అభిమానం పెంచితేనే మన తెలుగు లిపి భవిష్యత్తులోనూ వెలుగుతుందని చంద్రబాబు పేర్కొన్నారు. ఇందులో భాగంగా, తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా విడుదలైన 'కూల్‌ఫబెట్స్' యాప్‌ను ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. ఆటపాటల ద్వారా పిల్లలకు తెలుగుతో పాటు ఇతర భారతీయ భాషలను చదవడం, రాయడం నేర్పించే ఈ యాప్‌ను రూపొందించడం అభినందనీయమని అన్నారు. ఈ యాప్ రూపకర్తలైన కొల్లి రంజిత్, వెంకట్ ఏలేటితో పాటు వారి బృందానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ యాప్‌లో వినియోగించిన సాంకేతికతను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీ సహాయంతో పిల్లల చేతిరాతను పరిశీలించి, దాన్ని మెరుగుపరచడానికి అవసరమైన మార్గదర్శకత్వం అందించేలా యాప్‌ను తీర్చిదిద్దడంపై హర్షం వ్యక్తం చేశారు. సాంకేతికత మన భాషను దూరం చేయకూడదని, దానికి మరింత చేరువ చేసే సాధనంగా మారాలని సూచించారు. "మన భాష, మన లిపి, మన సంస్కృతే మన తెలుగు జాతికి అసలైన గుర్తింపు. తేనెలొలికే మన తెలుగు భాష, భావితరాల్లోనూ చిరస్థాయిగా వెలుగొందాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు తన పోస్టులో ఆకాంక్షించారు. సాంకేతికతను భాషాభివృద్ధికి వాడుకోవాలన్న ఆయన పిలుపుపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

తెలంగాణలో అంగన్‌వాడీ ఉద్యోగాల జాతర.. ఇంటర్ అర్హతతో 15,982 పోస్టుల భర్తీ



హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని నిరుద్యోగులకు శుభవార్త చెప్పింది. రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న భారీ సంఖ్యలో పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు మొత్తం 15,982 పోస్టులను సెప్టెంబర్ నెలలోగా భర్తీ చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, ఈ నియామకాలు జిల్లా స్థాయిలో జరగనున్నాయి. మొత్తం ఖాళీలలో జోన్-1 పరిధిలో 1,853 టీచర్ పోస్టులు, 7,737 ఆయా పోస్టులు ఉన్నాయి. జోన్-2 పరిధిలో 1,247 టీచర్ పోస్టులు, 5,145 ఆయా పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఇంటర్మీడియట్ (ఇంటర్) ఉత్తీర్ణులై ఉండాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. భ్యర్థుల ఎంపిక ప్రక్రియ ఇంటర్వ్యూ ద్వారా జరగనుంది. ఎంపికలో భాగంగా అభ్యర్థుల ఇంటర్మీడియట్‌లో సాధించిన మార్కులకు 70 శాతం వెయిటేజీ ఇవ్వనున్నారు. ఇంటర్వ్యూకు 10 శాతం మార్కులు కేటాయించారు. అలాగే, ప్రత్యేక కేటగిరీల కింద వితంతువులకు 5 శాతం, అనాథలకు 10 శాతం, దివ్యాంగులకు 5 శాతం చొప్పున వెయిటేజీ కల్పించనున్నారు. ఈ నియామక ప్రక్రియను వేగవంతం చేసి, సెప్టెంబర్ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఈ నిర్ణయంతో వేలాది మంది నిరుద్యోగ మహిళలకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

గత ప్రభుత్వ హయాంలో బలవంతపు మత మార్పిడులు జరిగాయి

అమరావతి: గత ప్రభుత్వ హయాంలో బలవంతపు మత మార్పిడులు జరిగాయని, దేవాలయాల పవిత్రతను దెబ్బతీశారని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో విమర్శించారు. ఓ మాజీ మంత్రి ఇంట్లోనే మత మార్పిడికి ఒత్తిడి జరిగిందని, ఆయన కోడలే ఈ విషయాన్ని బయటపెట్టిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. అరకు పర్యటనలో 'సంజీవని' కార్యక్రమంలో చంద్రబాబు ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "ఒక మాజీ మంత్రి కోడలు బయటకు వచ్చి, తనను ఇంట్లో మతం మారమని ఒత్తిడి చేస్తే తాను గట్టిగా నిరాకరించానని చెప్పింది. బయట హిందువులుగా చలామణి అవుతూ ఇంట్లో ఇలాంటి పనులు చేశారు. ఇది చాలా తప్పు. విశ్వాసం అనేది వ్యక్తిగతం, కానీ దాన్ని ఇతరులపై బలవంతంగా రుద్దడం దుర్మార్గం" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గత పాలనలో జరిగిన కొన్ని ఘటనలను కూడా ఆయన ప్రస్తావించారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో దేవాలయాలపై దాడులు జరిగాయని, ఆ పార్టీలో ఉండాలంటే మతమే ఒక కనీస అర్హతగా మార్చే పరిస్థితి తీసుకొచ్చారని చంద్రబాబు ఆరోపించారు. బలవంతపు మత మార్పిడులు మంచి పద్ధతి కాదని ఆయన హితవు పలికారు. ఇటువంటి చర్యల వల్లే ప్రజలు గత ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పారని అన్నారు. ఇటీవల మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత జోగి రమేశ్ కోడలు మేఘన మీడియా ముందుకు వచ్చి సంచలన ఆరోపణలు చేయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో, చంద్రబాబు వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

నేడు జూబ్లీహిల్స్ కో--ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ఎన్నికలు

హైదరాబాద్: జూబ్లీహిల్స్ కో--ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. ఈ నెల 30న జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యాభవన్ స్కూల్‌లో పోలింగ్ జరగనుంది. బొల్లినేని రవీంద్రనాథ్, బొల్లినేని శీనయ్య ప్యానెళ్లు గట్టిగా పోటీ పడుతున్నారు. మొత్తం 4039 ఓట్లు ఉన్న ఈ సొసైటీ ఆసియాలోనే బెస్ట్ ఎలైట్ సొసైటీగా పేరొందింది. 1160 ఎకరాల విస్తీర్ణంలో ఈ కాలనీ ఉండగా 80 శాతం నివాసితులు కోటీశ్వరులుగా నమోదై ఉన్నారు. ఈ ఎన్నికల్లో పలువురు సెలబ్రిటీలు, రాజకీయ నాయకులు, వీవీఐపీలు, పారిశ్రామిక వేత్తలు, వ్యాపార దిగ్గజాలు ఓటు హక్కు వినియోగించుకోనున్నాయి. ఓటు హక్కు కలిగిన వారిలో సీఎం రేవంత్‌రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు సినీ హీరోలు చిరంజీవి, నాగార్జున, మహేష్‌బాబు, అల్లు అర్జున్, జూనియర్ ఎన్టీఆర్ పాటు నిర్మాత నాగవంశీ, ఏషియన్ మూవీస్ సునీల్ నారంగ్, జస్టిస్ చలమేశ్వర్, జ్యువెలర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ కౌశిక్, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్, హెటిరో డ్రగ్స్ పార్థసారధి రెడ్డి, ఎంఎస్ఎన్ ఫార్మా అధినేత, దివీస్ ల్యాబ్స్ అధినేతతో, ప్రముఖ బిల్డర్లు డీఎస్ఆర్, జీవీపీఆర్, కేఎన్ఆర్‌లతో పాటు తాజా మాజీ ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు ప్రముఖ వ్యాపారులు, ప్రముఖ పారిశ్రామిక వేత్తలు ఓటు హక్కు కలిగి ఉన్నారు. 4039 మంది ఓటర్లలో 1656 మంది వీవీఐపీలు ఉన్నారు. ఇందులో 95 మంది మల్టీ మిలియనర్లు ఉండగా 68 మంది భారతదేశ టాప్ 100 ధనవంతుల్లో ఉన్నవారు ఉన్నారు. ఈ ఎన్నికలు అత్యంత ఖరీదైనవిగా భావిస్తున్నారు.

అమరావతిలో 2,500 ఎకరాల్లో స్పోర్ట్స్ సిటీ: కొల్లు రవీంద్ర



ప్రపంచంలో ఏ క్రీడా పోటీలు జరిగినా ఏపీ నుంచి ఒక్కరైనా ప్రాతినిధ్యం వహించాలనేది ప్రభుత్వ లక్ష్యమన్న మంత్రి ఆంధ్రప్రదేశ్‌ను క్రీడారంగంలో ప్రపంచ స్థాయిలో నిలిపేందుకు కూటమి ప్రభుత్వం భారీ ప్రణాళికలు రచిస్తోంది. తిరుపతిలో జరిగిన అంతర్జాతీయ క్రీడా దినోత్సవ ముగింపు సభలో పాల్గొన్న మంత్రులు కొల్లు రవీంద్ర, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి... రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి తీసుకోబోతున్న కీలక నిర్ణయాలను వెల్లడించారు. భారతదేశానికే ఆదర్శంగా రాజధాని అమరావతిలో 2,500 ఎకరాల విస్తీర్ణంలో భారీ 'స్పోర్ట్స్ సిటీ'తో పాటు 'స్పోర్ట్స్ యూనివర్సిటీ'ని ఏర్పాటు చేయనున్నట్లు కొల్లు రవీంద్ర తెలిపారు. క్రీడలను క్షేత్రస్థాయిలో ప్రోత్సహించడానికి పీవీ సింధు, పుల్లెల గోపీచంద్, కిదాంబి శ్రీకాంత్ వంటి ప్రముఖ క్రీడాకారుల అకాడమీలకు ప్రభుత్వం స్థలాలు కేటాయించిందని పేర్కొన్నారు. శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు గ్రామీణ ప్రతిభను వెలికితీసేందుకు 6 ప్రత్యేక అకాడమీలను ప్రారంభించామని, ప్రపంచంలో ఏ క్రీడా పోటీలు జరిగినా ఏపీ నుంచి కనీసం ఒక్కరైనా ప్రాతినిధ్యం వహించాలనేది ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. విశాఖలో ప్రధాని మోదీ సమక్షంలో జరిగిన ప్రపంచ యోగా దినోత్సవంలో 5 లక్షల మంది పాల్గొని రికార్డు సృష్టించారని గుర్తు చేస్తూ, రాష్ట్రాన్ని 'హెల్దీ, వెల్దీ అండ్ హ్యాపీ స్టేట్'గా తీర్చిదిద్దడమే సీఎం చంద్రబాబు ఆలోచన అని చెప్పారు. రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ... రాబోయే 50 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని క్రీడా మౌలిక వసతుల కల్పనకు రాష్ట్రాన్ని వైజాగ్, అమరావతి, తిరుపతిగా 3 జోన్లుగా విభజించినట్లు తెలిపారు. క్రీడా పరికరాల ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు నెల్లూరు పరిసర ప్రాంతాల్లో 1,000 ఎకరాల్లో 'స్పోర్ట్స్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్' ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే తిరుపతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడా ప్రాంగణాలు నిర్మిస్తున్నామని, మంత్రి నారా లోకేశ్ సూచనల మేరకు సీఎస్ఆర్ నిధులతో జెడ్పీహెచ్ఎస్ పాఠశాల మైదానాలను అభివృద్ధి చేసి గ్రామీణ యువతకు క్రీడా సదుపాయాలు మెరుగుపరచనున్నట్లు వివరించారు.

"పులివెందుల సబ్ జైలు మరియు లీగల్ ఎయిడ్ క్లినిక్ విజిట్"

కడప మహి న్యూస్ ఆగస్టు 29: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా, గౌరవ ఛైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయధికారి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప. జి .రామ గోపాల్ వారి సూచనల మేరకు గౌరవ సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప శ్రీ ఎస్.బాబా ఫక్రుద్దీన్ వారు పులివెందుల సబ్ జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్ లను విజిట్ చేయడం జరిగినది. రిజిస్టర్లను పరిశీలించడం జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను తెలియజేశారు, జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయము, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టము, ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు, ఉచిత న్యాయ సహాయమును సద్వినియోగం చేసుకోవాలి అన్నారు, తగు సూచనలను సలహాలను ఇవ్వడం జరిగినది. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 పై ప్రచారం నిర్వహించడం జరిగినది. ఏమైనా సమస్యలుంటే పులివెందుల మండల న్యాయ సేవా సమితిని మరియు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడప ను సంప్రదించవచ్చును అన్నారు. ఈ కార్యక్రమంలో పులివెందుల సబ్ జైలు సూపరింటెండెంట్, ప్యానల్ న్యాయవాదులు, కోర్ట్ సిబ్బంది, పారా లీగల్ వాలంటరీలు మరియు ఖైదీలు పాల్గొన్నారు.

"నూతనంగా బాధ్యతలు స్వీకరించిన గౌరవ ప్రధాన జిల్లా న్యాయమూర్తిని కలిసిన సెంట్రల్ జైలు, కడప సూపరింటెండెంట్"

కడప మహి న్యూస్ ఆగస్టు 29: కడప జిల్లాకు నూతనంగా నియమితులై బాధ్యతలు స్వీకరించిన గౌరవ ప్రధాన జిల్లా మరియు సెషన్స్ న్యాయమూర్తిని జి .రామ గోపాల్ వారిని కడప సెంట్రల్ ప్రిజన్ సూపరింటెండెంట్ కె.రాజేశ్వర రావు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ నూతన ప్రధాన జిల్లా న్యాయమూర్తికి పుష్ప మొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం జైలు పరిపాలన, ఖైదీల సంక్షేమం, న్యాయ సహాయం, న్యాయ సేవల కార్యక్రమాలు తదితర అంశాలపై పరస్పరం చర్చించారు. ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందించడం, వారి హక్కులపై అవగాహన కల్పించడం, న్యాయ సేవల కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా టీడీపీ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

మూడు రోజులపాటు ప్రొద్దుటూరు పాలిటెక్నిక్ కళాశాలలో పోటీలు

కడప జిల్లా/ ప్రొద్దుటూరు మహి న్యూస్, ఆగస్టు 29: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని కడప జిల్లా టీడీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో డిగ్రీ, పీజీ విద్యార్థులకు మూడు రోజులపాటు నిర్వహించనున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రొద్దుటూరు పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌ను కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు భూపేష్ సుబ్బరామిరెడ్డి, ప్రొద్దుటూరు శాసనసభ్యుడు నంద్యాల వరదరాజుల రెడ్డి ప్రారంభించారు. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు ప్రతిభావంతులైన క్రీడాకారులను

ప్రోత్సహించేందుకు ఇలాంటి క్రీడా పోటీలు ఎంతగానో దోహదపడతాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు నంద్యాల రాఘవ రెడ్డి, తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జబీవుల్లా, పార్లమెంట్ కమిటీ సభ్యుడు ఘంటసాల వెంకటేశ్వర్లు, టీడీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిరుమలేష్, బచ్చల ప్రతాప్, ప్రధాన కార్యదర్శి చేతన్ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దన్నవాడలో శ్రీ అభయ ఆంజనేయస్వామి పునఃప్రతిష్ఠ కార్యక్రమం

పూజా కార్యక్రమానికి హాజరైన టీడీపీ జిల్లా అధ్యక్షుడు భూపేష్ సుబ్బరామిరెడ్డి

కడప జిల్లా/మైలవరం మహి న్యూస్, ఆగస్టు 29: మైలవరం మండలం దన్నవాడ గ్రామంలో శ్రీ శ్రీ అభయ ఆంజనేయస్వామి పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు భూపేష్ సుబ్బరామిరెడ్డి, 20 సూత్రాల మాజీ ఛైర్మన్ తులసిరెడ్డి హాజరై

ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. గ్రామ ప్రజలు, భక్తులతో కలిసి ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో క్లాస్-1 కాంట్రాక్టర్ గోవిందు, పాపిరెడ్డి, కొండయ్య యాదవ్, సూర్య పెద్దిరాజు, బాలరాజు, శ్రీనివాసన్ రెడ్డి, శ్రీనివాసులు, నవాబుపేట యూత్ సభ్యులు, రామాంజనేయులు రెడ్డి, రాజేష్ రెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

తెలుగు భాష ఔన్నత్యానికి గిడుగు రామూర్తి చేసిన సేవలు చిరస్మరణీయం

తెలుగు భాషా దినోత్సవ సభలో డిఆర్వో కె. మల్లికార్జునుడు

కడప, మహి న్యూస్ ఆగస్టు 29 : తెలుగు భాషా ఉద్యమానికి ఊపిరి పోసి.. తెలుగు భాష ఔన్నత్యానికి కృషి చేసిన గిడుగు రామ్మూర్తి నేటి సమాజానికి ఆదర్శప్రాయులు అని.. డిఆర్వో కె. మల్లికార్జునుడు ప్రశంసించారు. శనివారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకుంటున్న.. గిడుగు రామూర్తి 163వ జయంతి వేడుకలు జిల్లా పర్యాటక సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా.. డిఆర్వో కె. మల్లికార్జునుడు హాజరయ్యి.. గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు

లర్పించారు. ఈ సందర్భంగా డిఆర్వో మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు.. గిడుగు వెంకట రామ్మూర్తి పంతుల జయంతి రోజును.. తెలుగుభాషా దినోత్సవంగా ప్రతి ఏడాది ప్రభుత్వ ఉత్సవంగా నిర్వహించుకోవడం హర్షించదగ్గ విషయం అన్నారు. గిడుగు రామమూర్తి.. తెలుగు వ్యవహారిక భాషోద్యమకర్తగా, పరిశోధనాకర్తగా, హేతువాదిగా ఆనాటి నుండి నేటి వరకు చిరపరిచితులుగా.. తెలుగు భాషా చరితలో చెరగని కావ్యంగా నిలిచారు. ఆయన వ్యవహారిక భాషా ఉద్యమంలో 'తెలుగు' అనే పత్రికను కూడా నడిపారని.. గ్రాంధికంలో కఠినంగా ఉన్న తెలుగు వచనాన్ని సరళంగా.. వ్యవహారిక భాషలోకి తీసుకొచ్చి తెలుగు భాషలోని అందాన్ని, తెలుగు పలుకులోని కమ్మదనాన్ని సమాజానికి రుచి చూపించారన్నారు. చిన్నప్పటినుంచే.. విద్యాసక్తి, కార్యదీక్ష, సత్యాన్వేషణం ప్రధాన లక్షణాలు అలవదాచుకున్న గిడుగు రామమూర్తి.. అంటరాని తనాన్ని కూడా వ్యతిరేఖించారు. ఆ రోజుల్లోనే.. ఆయన ఆటవిక జీవనం గడిపేవారు మాట్లాడే.. సవరల భాష నేర్చుకొని వాళ్ళకు చదువు చెప్పాలనే సంకల్పంతో.. తెలుగు, సవరభాషలు రెండూ వచ్చిన ఒక సవర వ్యవహర్తను ఇంట్లోనే పెట్టుకొని సవర భాష నేర్చుకున్నాడు. సవరభాషలో పుస్తకాలు వ్రాసి, సొంతడబ్బుతో బళ్ళు పెట్టి, అధ్యాపకుల జీతాలు చెల్లించి, సవరలకు వాళ్ళ భాషలోనే చదువు చెప్పేందుకు కృషి చేసినందుకు గాను.. ఆయనకు మద్రాసు ప్రభుత్వం వారు 1913 లో "రావు బహదూర్" బిరుదు ఇచ్చారన్నారు. తెలుగు భాషా ఉద్యమాన్ని నడిపిన గిడుగు రామ్మూర్తి నేటి తరానికి ఎంతో ఆదర్శప్రాయుడన్నారు. గిడుగు రామ్మూర్తి పంతులు తన జీవిత కాలమంతా వ్యవహారిక భాషా అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని, ఎంతో మంది కవులకు స్ఫూర్తిని ఇచ్చి మార్గదర్శకులయ్యారన్నారు. ఆయన సేవలు నేటి సమాజానికి ఆదర్శనీయం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక సాంస్కృతిక శాఖ అధికారి సురేష్ కుమార్, స్టెప్ సీఈవో ప్రసాద్, డిప్యూటీ లేబర్ కమిషనర్ శ్రీనివాసులు అన్ని శాఖల అధికారులు, కలెక్టరేట్ లోని అన్ని సెక్షన్ల ఉద్యోగులు, పలువురు భాషా పండితులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి

రాష్ట్ర సగటు ధరల కంటే అధికంగా విక్రయిస్తే చర్యలు తప్పవు

నిర్ణయించిన ధరలకే విక్రయాలు జరపాలి: జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్

రైతు బజార్లలో ప్రత్యేక బియ్యం కౌంటర్లు

కర్నూలు, ఆగస్టు 29: (మహి న్యూస్): జిల్లాలో నిత్యావసర వస్తువుల ధరలను నిరంతరం పర్యవేక్షిస్తూ, రాష్ట్ర సగటు ధరల కంటే తక్కువగా లేదా కనీసం రాష్ట్ర సగటు ధరలకు అనుగుణంగా వినియోగదారులకు అందుబాటులో ఉండేలా అధికారులు, వ్యాపారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్

హాల్లో నిత్యావసర వస్తువుల ధరలపై జిల్లా స్థాయి ధరల నియంత్రణ కమిటీ సమావేశం నిర్వహించారు. సంబంధిత శాఖల అధికారులు, హోల్‌సేల్ రైస్ అసోసియేషన్, రిటైల్ అసోసియేషన్ ప్రతినిధులతో జాయింట్ కలెక్టర్ ధరల పరిస్థితిపై సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తులు, నిత్యావసర వస్తువులకు సంబంధించి రైతులు, వినియోగదారుల ప్రయోజనాలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ధరలు అకస్మాత్తుగా తగ్గితే రైతులు నష్టపోయే అవకాశం ఉందని, అదే విధంగా అధికంగా పెరిగితే వినియోగదారులపై అదనపు భారం పడుతుందని తెలిపారు. ధరల్లో తీవ్ర హెచ్చుతగ్గులు లేకుండా స్థిరత్వం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సాధారణ మార్కెట్ పరిస్థితులకు మించి అసాధారణంగా పెరిగిన వస్తువుల ధరలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని జేసీ పేర్కొన్నారు. పెద్ద నగరాల్లో రవాణా, అద్దెలు, ఇతర నిర్వహణ వ్యయాల కారణంగా కొంత ధరల వ్యత్యాసం ఉండవచ్చని, అయితే జిల్లాలో రాష్ట్ర సగటు కంటే అధిక ధరలకు నిత్యావసర వస్తువులను విక్రయించడం సమంజసం కాదన్నారు. సరుకుల కొనుగోలు ధరకు అనుగుణంగా సహేతుకమైన మార్జిన్ మాత్రమే తీసుకోవాలని వ్యాపారులకు సూచించారు. పప్పుధాన్యాలు, చక్కెర, సన్‌ఫ్లవర్ ఆయిల్, బియ్యం వంటి ప్రధాన నిత్యావసర వస్తువుల హోల్‌సేల్, రిటైల్ ధరల మధ్య వ్యత్యాసాన్ని సమీక్షించి, రాష్ట్ర సగటు ధరలకు అనుగుణంగా విక్రయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని జేసీ ఆదేశించారు. అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టేందుకు పౌరసరఫరాలు, జీఎస్టీ, లీగల్ మెట్రాలజీ, మున్సిపల్ తదితర శాఖల అధికారులు బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ధరలు అదుపులోకి రాకపోతే నిబంధనల మేరకు అవసరమైన చర్యలు, ఆంక్షలు విధించాల్సి వస్తుందని స్పష్టం చేశారు.

నిర్ణయించిన ధరలకే విక్రయాలు

ధరల నియంత్రణ కమిటీ నిర్ణయించిన ధరలకు అనుగుణంగానే వినియోగదారులకు నిత్యావసర వస్తువులను విక్రయించాలని జేసీ అసోసియేషన్ ప్రతినిధులను ఆదేశించారు.

- సూపర్ ఫైన్ నాణ్యత బియ్యం (8 నెలల పాతది) --- కిలో రూ.56
- కందిపప్పు --- కిలో రూ.117
- ఫ్రీడమ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ --- లీటరు రూ.178
- పంచదార --- కిలో రూ.57

ఇతర నిత్యావసర వస్తువులను కూడా రాష్ట్ర సగటు ధరలకు అనుగుణంగా అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతు బజార్లలో ఉల్లిపాయల ధరలు నియంత్రణలో ఉండేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఎస్టేట్ అధికారులకు సూచించారు.

రైతు బజార్లలో ప్రత్యేక బియ్యం కౌంటర్లు

జిల్లాలోని సి.క్యాంప్ రైతు బజార్, వెంకట రమణ కాలనీ రైతు బజార్, కొత్తపేట రైతు బజార్, ఆదోని రైతు బజార్లలో ప్రత్యేక బియ్యం కౌంటర్లను ఏర్పాటు చేసి 8 నెలల పాత సూపర్ ఫైన్ బియ్యాన్ని కిలో రూ.52, పచ్చి బియ్యాన్ని కిలో రూ.50 చొప్పున విక్రయిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు. బియ్యం నాణ్యతను ల్యాబ్ పరీక్షల ద్వారా నిర్ధారించినట్లు పేర్కొన్నారు. ఆధార్ కార్డు ఆధారంగా ఒక్కో కుటుంబానికి గరిష్టంగా 10 కిలోల బియ్యం అందజేస్తామని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజా రఘువీర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, మార్కెటింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ నారాయణమూర్తి, లీగల్ మెట్రాలజీ అధికారి శ్రీరాములు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఏపీ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌కు కర్నూలు రేంజ్ క్రీడాకారుల సన్నద్ధత

క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లు అందజేసిన కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఐపీఎస్

కర్నూలు, ఆగస్టు 29: (మహి న్యూస్): గుంటూరులో సెప్టెంబర్ 1 నుంచి 3వ తేదీ వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌కు కర్నూలు రేంజ్‌కు చెందిన పోలీసు అధికారులు, సిబ్బంది సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో కర్నూలు రేంజ్ నుంచి క్రీడా పోటీలకు ఎంపికైన పోలీసు అధికారులు, సిబ్బందికి కర్నూలు రేంజ్ డీఐజీ శ్రీ కోయ ప్రవీణ్ ఐపీఎస్ శనివారం కర్నూలు రేంజ్ డీఐజీ కార్యాలయంలో స్పోర్ట్స్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా డీఐజీ కోయ ప్రవీణ్ ఐపీఎస్ క్రీడాకారులను అభినందించారు. క్రీడా పోటీల్లో పూర్తి ఉత్సాహంతో పాల్గొని, అత్యుత్తమ ప్రతిభ కనబరిచి కర్నూలు రేంజ్‌కు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పోలీసు సిబ్బందిలో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందించడంలో

క్రీడలు కీలకపాత్ర పోషిస్తాయని డీఐజీ తెలిపారు. విధి నిర్వహణలో పోలీసులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ఏపీ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో కర్నూలు రేంజ్‌కు చెందిన క్రీడాకారులు తమ ప్రతిభను చాటుతూ ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఐజీ సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐలు చంద్రబాబు నాయుడు, తేజామూర్తి, తిక్కస్వామి, ఆర్ఐలు, ఎస్ఐలు, స్పోర్ట్స్ మీట్‌కు ఎంపికైన పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నగర రూపురేఖలు మార్చేలా సుందరీకరణ

9 ప్రధాన కూడళ్ల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

కూడళ్లలో టర్ఫ్ గడ్డి, వాటర్ ఫౌంటెన్ల అభివృద్ధి

డివైడర్లు, నడకబాటలకు కొత్త రూపు

పచ్చదనం, ఆకర్షణీయమైన చిత్రాలతో నగర సుందరీకరణ

నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసు



కర్నూలు, ఆగస్టు 29: (మహి న్యూస్): కర్నూలు నగరాన్ని మరింత సుందరంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు ప్రధాన కూడళ్లు, రహదారులు, డివైడర్లు, నడకబాటల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. శనివారం ఆయన నగరంలోని 5 రహదారుల కూడలిలో చేపట్టిన ఆధునికీకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలోని 9 ప్రధాన కూడళ్లను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. కూడళ్లలో టర్ఫ్ గడ్డి ఏర్పాటు చేయడంతో పాటు వాటర్ ఫౌంటెన్ల మరమ్మతులు

చేపట్టేందుకు సుమారు రూ.30 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు చెప్పారు. ప్రధాన రహదారుల వెంట ఉన్న డివైడర్లకు ఆకర్షణీయమైన రంగులు వేయడంతో పాటు, నడకబాటలకు అవసరమైన మరమ్మతులు చేపడుతున్నట్లు వెల్లడించారు. రహదారుల వెంట పచ్చదనం పెంపొందించడం, మొక్కలు నాటడం, గోడలపై ఆహ్లాదకరమైన చిత్రాలను ఏర్పాటు చేయడం వంటి పనులు చేపట్టనున్నట్లు కమిషనర్ తెలిపారు. నగరానికి వచ్చే ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా సుందరీకరణ పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. కూడళ్ల అభివృద్ధితో పాటు నగర పరిశుభ్రత, పచ్చదనాన్ని కాపాడేందుకు ప్రజలు కూడా సహకరించాలని కమిషనర్ కోరారు. కార్యక్రమంలో హార్టికల్చర్ ఏడి ప్రతాప్ రెడ్డి, డీఈఈ కృష్ణలత, తదితరులు పాల్గొన్నారు.

రహదారులపై ఆక్రమణలు సరికాదు

ట్రాఫిక్ నియంత్రణకు, వాహనదారుల భద్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు

కర్నూలు, ఆగస్టు 29: (మహి న్యూస్): నగరంలోని రహదారులను ఆక్రమించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడంతో పాటు వాహనదారుల భద్రతకు ముప్పు కలిగించడం ఏమాత్రం సబబు కాదని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు స్పష్టం చేశారు. శనివారం బళ్లారి చౌరస్తా వద్ద 44వ జాతీయ రహదారి సర్వీస్ రహదారిపై ఉన్న ఆక్రమణలను నగరపాలక సంస్థ అధికారులు తొలగించారు. రహదారిపై ఉంచిన టైర్లు, శాశ్వత నిర్మాణాలను ఆక్రమణదారులు వెంటనే స్వచ్ఛందంగా తొలగించుకోవాలని కమిషనర్ హెచ్చరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో వాహనదారులు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ ఇబ్బందులు, రహదారులపై చోటుచేసుకుంటున్న ప్రమాదాలను వాణిజ్య దుకాణదారులు గుర్తించాలని సూచించారు. సామాజిక బాధ్యతగా వ్యవహరిస్తూ రహదారులను ఆక్రమించకుండా నగరపాలక సంస్థకు సహకరించాలని కోరారు.

ట్రాఫిక్ సజావుగా సాగేందుకు, వాహనదారులు సురక్షితంగా రాకపోకలు సాగించేందుకు రహదారులు, సర్వీస్ రోడ్లను ఆక్రమణలకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. నిబంధనలు ఉల్లంఘించి రహదారులను ఆక్రమిస్తే ఎలాంటి రాజీ లేకుండా ఆక్రమణలను తొలగించాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం కమిషనర్ విష్ణు టౌన్‌షిప్‌లో మురుగు కాలువలో తాగునీటి పైప్‌లైన్ మార్పు పనులు జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలించారు. అలాగే పందిపాడులో నూతన డ్రెయిన్ నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. నందికొట్కూరు రోడ్డులోని డిమార్ట్ సమీపంలో పిజిఆర్‌యస్ ఫిర్యాదుకు సంబంధించిన ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం ముజఫర్ నగర్ నూతన రైతు బజార్‌ను సందర్శించి డస్ట్‌బిన్‌ల వినియోగం, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. సెట్కూర్ కార్యాలయం వద్దనున్న అన్న క్యాంటీన్‌ను కూడా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈలు ప్రవీణ్ కుమార్ రెడ్డి, జనార్ధన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఎంజల్ ప్రణీత, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

15 రోజుల పాటు ఎల్ఈడీ మొబైల్ వాహనంతో

హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన

లైంగికంగా సంక్రమించే వ్యాధుల నివారణ, ముందస్తు పరీక్షలు, చికిత్సపై ప్రజలకు అవగాహన

కర్నూలు, ఆగస్టు 29: (మహి న్యూస్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు, జిల్లా కలెక్టర్ అనుమతితో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ మరియు జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో కర్నూలు జిల్లాలో 15 రోజుల పాటు ఎల్ఈడీ మొబైల్ వాహనం ద్వారా లైంగికంగా సంక్రమించే వ్యాధులు, హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని కర్నూలులోని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి కార్యాలయం వద్ద ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ ఎల్. భాస్కర్, ఏఆర్‌టీ నోడల్ అధికారి డాక్టర్ సోమప్ప ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎల్. భాస్కర్ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాలు, గ్రామాలు, పట్టణాల్లో ఎల్ఈడీ మొబైల్ వాహనం ద్వారా ఎస్‌టీఐ, హెచ్ఐవీ/ఎయిడ్స్ వ్యాధుల వ్యాప్తి, నివారణ, ముందస్తు పరీక్షలు, చికిత్స, అపోహల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రజలకు సులభంగా అర్థమయ్యే విధంగా అవగాహన సందేశాలు, వీడియోలు, సమాచార చిత్రాలను ప్రదర్శించడంతో పాటు హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై ఉన్న అపోహలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. హెచ్ఐవీతో జీవిస్తున్న వ్యక్తుల పట్ల వివక్ష చూపకుండా సమాన గౌరవంతో వ్యవహరించాల్సిన అవసరాన్ని కూడా ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. ఈ 15 రోజుల కార్యక్రమంలో ముఖ్యంగా యువత, మహిళలు, సాధారణ ప్రజలు, అధిక ప్రమాద ప్రవర్తనకు గురయ్యే వర్గాలకు ఎస్‌టీఐ, హెచ్ఐవీ/ఎయిడ్స్ నివారణ చర్యలపై అవగాహన కల్పించనున్నారు. అవసరమైన వారికి సంబంధిత ఆరోగ్య సేవలు, హెచ్ఐవీ పరీక్షలు, కౌన్సెలింగ్ సేవలు అందుబాటులో ఉన్న విధానంపై మార్గనిర్దేశం చేయనున్నట్లు పేర్కొన్నారు. క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ అలీ హైదర్ మాట్లాడుతూ లైంగికంగా సంక్రమించే వ్యాధులు, హెచ్ఐవీ/ఎయిడ్స్ నివారణకు ప్రజల్లో అవగాహన అత్యంత కీలకమన్నారు. సరైన సమాచారం, సురక్షితమైన ఆరోగ్య ప్రవర్తనలు, సమయానికి పరీక్షలు, చికిత్స ద్వారా హెచ్ఐవీ వ్యాప్తిని గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ప్రజలు ఈ అవగాహన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కర్నూలు జిల్లాలో 15 రోజుల పాటు కొనసాగనున్న ఎల్ఈడీ మొబైల్ వాహన కార్యక్రమాన్ని ప్రజలు, యువత, స్వచ్ఛంద సంస్థలు, సంబంధిత వర్గాలు సద్వినియోగం చేసుకుని హెచ్ఐవీ/ఎయిడ్స్ నిర్మూలనలో భాగస్వాములు కావాలని అధికారులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో క్షయ, లెప్రసీ వైద్య అధికారి మల్లికార్జున రెడ్డి, ఏఆర్‌టీ వైద్యాధికారి అభిగేయల్, దేవి శంకర్ గౌడ, సీపీఓ రాజ్యలక్ష్మి స్వచ్ఛంద సంస్థల మేనేజర్లు, ఏపీ సాక్స్ భాగస్వామ్య సంస్థల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాఘవేంద్ర స్వామి సప్తరాత్రోత్సవాల్లో

పటిష్ట భద్రతా ఏర్పాట్లు

ముఖద్వారం నుంచి శ్రీమఠం వరకు భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ విక్రాంత్ పాటిల్

ఫాల్కన్ వాహనం, డ్రోన్ కెమెరాలు, బాడీ వోర్న్ కెమెరాలు, సీసీ కెమెరాల పరిశీలన

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా 300 మంది పోలీసులతో బందోబస్తు

కర్నూలు, ఆగస్టు 29: (మహి న్యూస్): మంత్రాలయంలో కొలువైన శ్రీ రాఘవేంద్ర స్వామి వారి 355వ సప్తరాత్రోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు కర్నూలు జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ తెలిపారు. ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 2 వరకు నిర్వహిస్తున్న సప్తరాత్రోత్సవాల్లో భాగంగా శనివారం ఎస్పీ మంత్రాలయంలోని ఆలయ పరిసరాలను, భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముఖద్వారం నుంచి శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం వరకు పర్యటించిన ఎస్పీ భక్తుల రాకపోకలు, క్యూ లైన్లు, ఆలయ ప్రాకారం, పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన భద్రతా చర్యలను పరిశీలించారు. ఫాల్కన్ వాహనం, డ్రోన్ కెమెరాలు, బాడీ వోర్న్ కెమెరాలు, సీసీ కెమెరాలు తదితర భద్రతా పరికరాల పనితీరును పరిశీలించి పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు

తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా దాదాపు 300 మంది పోలీసు సిబ్బందితో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, రద్దీ ప్రాంతాల్లో నిరంతరం నిఘా కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎస్పీ శ్రీమఠంలోని క్యూ లైన్ ప్రాంతం, దేవాలయ ప్రాకారం, తుంగభద్ర నది తీర ప్రాంతాలను పరిశీలించారు. ఆలయంలో అమ్మవారి దర్శనం చేసుకున్న అనంతరం నిఘా నేత్రాలుగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పర్యవేక్షణ వ్యవస్థను కూడా పరిశీలించారు. సప్తరాత్రోత్సవాల సందర్భంగా శ్రీమఠం ఆధ్వర్యంలో చేపట్టిన ఏర్పాట్లు, భక్తుల కోసం కల్పించిన సౌకర్యాల గురించి మఠం సహాయ మేనేజర్ ఐపీ నరసింహామూర్తి జిల్లా ఎస్పీకి వివరించారు. ఎస్పీ వెంట స్పెషల్ బ్రాంచ్ సీఐ మధుసూదన్‌రావు, మంత్రాలయం సీఐ దస్తగిరి, సీఐ రామాంజులు, శ్రీమఠం అధికారులు తదితరులు ఉన్నారు.

విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలి

డ్రగ్స్ వాడకంపై విస్తృత ప్రచారం నిర్వహించాలి

విద్యాసంస్థల పరిసరాల్లోని దుకాణాలపై గట్టి నిఘా పెట్టాలి

గంజాయి సాగు చేస్తున్న వారిపై వెంటనే కేసులు నమోదు చేయాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి

కర్నూలు, ఆగస్టు 29: (మహి న్యూస్): జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు. విద్యార్థులు మత్తు పదార్థాల బారిన పడకుండా నిరంతరం నిఘా ఉంచడంతో పాటు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యాశాఖ, సంక్షేమ వసతి గృహాలు, ఈగల్ టీమ్ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును కాపాడటం ప్రతి అధికారి బాధ్యతగా భావించాలని అన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా హాస్టళ్లలో వారి ప్రవర్తనను నిరంతరం గమనించాలని అధికారులను ఆదేశించారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలు, మత్తు పదార్థాలకు సంబంధించిన కేసులు నమోదైతే ఎదురయ్యే పరిణామాలపై విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. వాల్ పోస్టర్లు, స్టిక్కర్లు, మీడియా తదితర ప్రచార మాధ్యమాల ద్వారా డ్రగ్స్ వ్యతిరేక సందేశాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. జిల్లాలో డ్రగ్స్ రహిత వాతావరణం కల్పించేలా ఈగల్ టీమ్ అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా విద్యాసంస్థల పరిసరాల్లోని దుకాణాలపై గట్టి నిఘా ఉంచి, మత్తు పదార్థాల విక్రయాలు లేదా అనుమానాస్పద కార్యకలాపాలు గుర్తిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆదోని రెవెన్యూ డివిజన్‌లోని చిప్పగిరి, పెద్దహరివాణం, హోలగుంద, ఆలూరు మండలాల్లోని కొన్ని గ్రామాల్లో రైతులు, ఇతరులు రహస్యంగా గంజాయి సాగు చేస్తున్నట్లు సమాచారం ఉందని కలెక్టర్ తెలిపారు. ఎక్కడైనా గంజాయి సాగు జరుగుతున్నట్లు నిర్ధారణ అయితే వెంటనే కేసులు నమోదు చేసి, సాగును అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మిని ఆదేశించారు.

వసతి గృహాల్లో విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం

సంక్షేమ వసతి గృహాల అధికారులతో మాట్లాడుతూ సిబ్బంది ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం, స్వచ్ఛమైన తాగునీరు అందించాలని ఆదేశించారు. వసతి గృహాల్లో మెరుగైన సౌకర్యాలు, నీటి వసతి, దోమల నివారణకు మెష్‌ల ఏర్పాటు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, ప్రశాంతమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే సంక్షేమ వసతి గృహాల్లో థర్డ్ పార్టీ ఆడిట్ నిర్వహిస్తామని హెచ్చరించారు. వసతి గృహాలకు అవసరమైన మౌలిక వసతులు, ఇతర ఏర్పాట్లపై పూర్తి వివరాలతో నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, డీఈఓ సుధాకర్, ఎస్ఎస్ఏ పీఓ లోకరాజు, ఆర్ఐఓ లాలెప్ప, జిల్లా ఎస్సీ, బీసీ సంక్షేమ అధికారులు రాధిక, ప్రసూన, డీవీవీ సురేష్‌బాబు, రెసిడెన్షియల్ స్కూల్స్ కోఆర్డినేటర్ పుష్పరాజ్, మైనారిటీ వెల్ఫేర్ అధికారిణి సబిహా పర్వీన్, జ్యోతిబా పూలే విద్యాలయ జూనియర్ లెక్చరర్ యమునాదేవి, ఈగల్ టీమ్ ఎస్సై రమేష్ నాయక్, హెడ్ కానిస్టేబుల్ ఎలీషా తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశించిన లక్ష్యాల మేరకు రుణాలు మంజూరు చేయాలి

గృహ నిర్మాణం, విద్య, ఎంఎస్ఎంఈ, వ్యవసాయ రంగాలకు రుణాలపై ప్రత్యేక దృష్టి

పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి

కర్నూలు, ఆగస్టు 29: (మహి న్యూస్): జిల్లాలో బ్యాంకర్లు నిర్దేశించిన లక్ష్యాల మేరకు రుణాలు మంజూరు చేయాలని, ముఖ్యంగా గృహ నిర్మాణం, విద్య, సూక్ష్మ చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ), వ్యవసాయ మౌలిక వసతులు, వ్యవసాయ అనుబంధ రంగాలకు రుణాల మంజూరుపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి బ్యాంకు అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో బ్యాంకర్లకు సంబంధించిన జిల్లా సంప్రదింపుల కమిటీ (డీసీసీ) సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాలకు సంబంధించిన రుణాల మంజూరు, లక్ష్య సాధన, పెండింగ్ దరఖాస్తులపై సమీక్షించారు. విద్యా రుణాల విషయంలో బ్యాంకులు మరింత చొరవ చూపాలని కలెక్టర్ సూచించారు. అర్హులైన విద్యార్థులకు సకాలంలో రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గృహ నిర్మాణ రంగంలో రుణాల లక్ష్య సాధన కేవలం 12.45 శాతం మాత్రమే ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న రుణ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి లక్ష్యాలను మెరుగుపరచాలని బ్యాంకర్లను ఆదేశించారు. వ్యవసాయ మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించిన రుణాల పురోగతి కూడా ఆశించిన స్థాయిలో లేదని కలెక్టర్ పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారులను గుర్తించి రుణాల మంజూరును వేగవంతం చేయాలని సూచించారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించి అధిక లక్ష్యాలు ఉన్నప్పటికీ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 49 శాతం లక్ష్యాన్ని సాధించిందని తెలిపారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐసీఐసీఐ బ్యాంకులు మరింత చొరవ చూపి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలతో వచ్చే త్రైమాసికంలో మెరుగైన పురోగతి సాధించాలని ఆదేశించారు.

ఎంఎస్ఎంఈలకు రుణాల పంపిణీ వేగవంతం చేయాలి

జిల్లా ఆర్థికాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పనలో ఎంఎస్ఎంఈ రంగం కీలక పాత్ర పోషిస్తుందని కలెక్టర్ అన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు రుణాల పంపిణీలో బ్యాంకులు చురుకుగా వ్యవహరించి నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో సాధించాలని సూచించారు.

ఎంఎస్ఎంఈ రుణాల లక్ష్య సాధనలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెరుగైన పనితీరు కనబరుస్తోందని పేర్కొంటూ, ఇతర బ్యాంకులు కూడా ఎస్‌బీఐ అనుసరిస్తున్న విధానాలు, కార్యాచరణ ప్రణాళికలను అధ్యయనం చేసి లక్ష్య సాధనకు కృషి చేయాలని సూచించారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఎంఎస్ఎంఈ రుణాల లక్ష్య సాధనలో కేవలం 11 శాతం ప్రగతిలో ఉండటంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సెప్టెంబర్ నెలాఖరులోగా కనీసం 50 శాతం లక్ష్యాన్ని సాధించేలా స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని ఆదేశించారు.

పశుపోషణకు రుణాలు అందించాలి

సాగునీటి సమస్యల కారణంగా రైతులు కొంతకాలంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కలెక్టర్ తెలిపారు. ఈ నేపథ్యంలో పశుపోషణ మంచి ప్రత్యామ్నాయ జీవనోపాధిగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అర్హులైన రైతులు, లబ్ధిదారులకు పశుపోషణ యూనిట్ల ఏర్పాటుకు ఎక్కువ సంఖ్యలో రుణాలు మంజూరు చేసి వారికి అండగా నిలవాలని బ్యాంకర్లను ఆదేశించారు. పశుసంవర్థక యూనిట్లకు బీమా ఎంతో ముఖ్యమని, ప్రతి యూనిట్‌కు బీమా కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

పీఎం విశ్వకర్మ ముద్ర రుణాలపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో పీఎం విశ్వకర్మ పథకం కింద పెండింగ్‌లో ఉన్న అర్హులైన లబ్ధిదారుల రుణ దరఖాస్తులను సెప్టెంబర్ నెలాఖరులోగా పరిష్కరించి రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ముద్ర రుణాల కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను కూడా త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. పీఎంఎఫ్ఎంఈ పథకం కింద రుణ దరఖాస్తుల తిరస్కరణలు అధికంగా ఉండటంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. తిరస్కరించబడిన దరఖాస్తులను ప్రత్యేకంగా పునఃపరిశీలించి, అర్హులైన లబ్ధిదారులకు రుణాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రుణ దరఖాస్తులు ఎందుకు తిరస్కరణకు గురవుతున్నాయో అధికారులు, బ్యాంకర్లు మూల కారణాలను గుర్తించాలని అన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించినప్పుడే రుణ లక్ష్యాలను సమర్థవంతంగా సాధించగలమని స్పష్టం చేశారు. అర్హులైన పేద కుటుంబాలకు ఉపాధి అవకాశాలు కల్పించే విషయంలో కేవలం నిబంధనలకే పరిమితం కాకుండా మానవతా దృక్పథంతో వ్యవహరించాలని బ్యాంకర్లకు సూచించారు.

పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రోత్సహించాలి

పీఎం సూర్యఘర్ పథకం ద్వారా సౌర విద్యుత్ పైకప్పుల ఏర్పాటును ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. అర్హులైన లబ్ధిదారులకు పథకం ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని, బ్యాంకులతో సమన్వయం చేసుకుని రుణాలు సకాలంలో మంజూరయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లీడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ రవీంద్రబాబు, కర్నూలు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ పి. మోహన్, నాబార్డ్ డీడీఎం ఎం. సుబ్బారెడ్డి, కెనరా బ్యాంక్ రీజినల్ మేనేజర్ సుశాంత్ కుమార్, కెనరా బ్యాంక్ ఆర్‌సెటీ డైరెక్టర్ పుష్ప కుమార్, కేడీసీసీ బ్యాంక్ సీఈఓ రామాంజనేయులు, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, కర్నూలు అదనపు మున్సిపల్ కమిషనర్ కృష్ణ, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి సబిహా పర్వీన్, పరిశ్రమల శాఖ అధికారి సంజీవ రాజు, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్, మెప్మా పీడీ శ్రీనివాసులు, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, వివిధ బ్యాంకుల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

యువత మేలుకో.. ఓటరుగా నమోదు చేసుకో..

కర్నూలు అసెంబ్లీ యువతకు ఈఆర్వో, కమిషనర్ పిలుపు

ఆదివారం పోలింగ్ కేంద్రాల్లో 'స్పెషల్ క్యాంపెయిన్ డే'

ఫారం-6, 7, 8 ద్వారా ఓటర్ల జాబితాలో నమోదు, సవరణలకు అవకాశం

కర్నూలు, ఆగస్టు 29: (మహి న్యూస్): 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ యువకుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఈఆర్వో, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా ఆదివారం పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించనున్న 'స్పెషల్ క్యాంపెయిన్ డే'ను అర్హులైన యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శనివారం ఏ.క్యాంపులోని ఇందిరాగాంధీ మెమోరియల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఈఆర్వో పరిశీలించారు. అక్కడ జరుగుతున్న ఓటర్ల నమోదు, అభ్యంతరాలు, వివరాల సవరణ ప్రక్రియను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఈఆర్వో మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని అన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ యువకుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

ఫారం-6, 7, 8తో దరఖాస్తు చేసుకోవచ్చు

ఓటర్ల జాబితాలో కొత్తగా పేరు నమోదు చేసుకునేందుకు ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అనర్హులు, మరణించిన వ్యక్తులు లేదా ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా తరలివెళ్లిన వారి పేర్లపై అభ్యంతరం తెలియజేయడానికి లేదా తొలగింపు కోసం ఫారం-7ను వినియోగించుకోవచ్చన్నారు. అదేవిధంగా ఓటర్ల జాబితాలో పేరు, చిరునామా తదితర వివరాల్లో మార్పులు లేదా సవరణలు చేసుకోవడానికి ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. ఎస్ఐఆర్ ముసాయిదా జాబితాలో పేరు లేని అర్హులైన వారు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆదివారం నిర్వహించే స్పెషల్ క్యాంపెయిన్ డేలో ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద బూత్ లెవల్ అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. అర్హత కలిగిన యువతతో పాటు ఇప్పటికే ఓటర్లుగా ఉన్న వారు కూడా జాబితాలో తమ పేరు, ఇతర వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని సూచించారు. 18 ఏళ్లు పూర్తయిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవడంతో పాటు, ఓటర్ల జాబితాలో తమ పేరు ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని, అవసరమైన సవరణలు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అధికారులు కోరారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT # 87/985-V-P-C-29,VIJAYAPURICOLONY, BESIDE KENDRIYA VIDYALAYA SCHOOL, NEAR NADHYAL CHECKPOST, KURNOOL-518001, A.P PRINTED AT VSAR PRINTERS, KURNOOL-518001.RNI NO : APTEL/26/A3560. Cell 90 59 58 58 98. Email :mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com